పనులు మొదలయ్యేదెన్నడో..?

- నూతన జీపీ కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు
- ఇటీవల ఆరు గ్రామాలకు రూ. 1.20 కోట్లు విడుదల
- నేటికి ప్రారంభంకాని నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


వెదిర గ్రామ పంచాయతీ కార్యాలయం

రామడుగు: గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయినప్పటికీ నిర్మాణ పనులు నేటికి ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. రామడుగు మండలంలోని ఆరు గ్రామాల్లో నూతన పంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం రూ. 1.20 కోట్లు విడుదల చేసింది. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పనుల నిర్వహణను పట్టించుకోకపోవడంతో భవన నిర్మాణ పనులు మొదలుపెట్టలేదు.

• ఒక్కో గ్రామానికి రూ. 20 లక్షల చొప్పున
మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దేశరాజ్‌పల్లి, గోపాల్‌రావుపేట, పందికుంటపల్లి (నూతన గ్రామపంచాయతీ), రుద్రారం, షానగర్, వెదిర గ్రామాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో గ్రామ పంచాయతీకి ప్రభుత్వం రూ. 20 లక్షల చొప్పున కేటాయించింది.

• రెండు పంచాయతీ భవనాలకు శంకుస్థాపన...
మండలంలోని షానగర్, దేశరాజ్‌పల్లి గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణానికి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఫిబ్రవరిలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అయినప్పటికీ రెండు గ్రామాల్లో పనులు నేటికి ముందుకుసాగడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

• భవనాల నిర్మాణాలకు స్థల సమస్య...
ప్రభుత్వం నూతన జీపీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ స్థల సమస్య ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పాత భవనాల స్థలంలో నిర్మిస్తే స్థలం సరిపోదని, కొత్త స్థలంలో నిర్మాణం చేయాలంటే ప్రభుత్వ స్థలం దొరక్క సమస్య ఏర్పడుతుంది అంటున్నారు. మండలంలోని వెదిర, దేశరాజ్‌పల్లి, గోపాల్‌రావుపేట గ్రామాల పంచాయతీలకు స్థల సమస్య ఉంది. షానగర్, పందికుంటపల్లి, రుద్రారం గ్రామాల్లో సమస్యలేదని అధికారులు తెలిపారు. త్వరగా కొత్త పంచాయతీ భవనాలను నిర్మించాలని వెదిర, గోపాల్‌రావుపేట, రుద్రారం, షానగర్, దేశరాజ్‌పల్లి, పందికుంటపల్లి గ్రామస్తులు అధికారులు, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పనులు ప్రారంభిస్తాం



మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల్లో నూతన జీపీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. కోటి ఇరవై లక్షలు మంజూరు చేసింది. భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల సమస్య కొన్ని గ్రామాల్లో నెలకొంది. వాటిని పరిష్కరించి త్వరలో పనులు ప్రారంభిస్తాం.
– సచిన్, ఏఈ పీఆర్, రామడుగు

క్లుప్తంగా

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి

సైదాపూర్: మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని గురువారం సామాజిక కార్యకర్త గాదపాక కుమార్‌రాజా ప్రభుత్వాన్ని కోరారు. రోజూ సైదాపూర్ నుంచి సోమారం చౌరస్తా వరకు పలువురు వాకింగ్ చేస్తున్నారు. ప్రధాన రహదారి, నిత్యం వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వెన్కెపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తే, వాకర్స్‌కు ఉపయోగకరంగా ఉంటుందని, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కృషి చేయాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం


ఆవరణ శుభ్రం చేస్తున్న వలంటీర్లు

గంగాధర: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వికాస్ ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా వీధులు, పాఠశాల ఆవరణ శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సతీష్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, రమణ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ స్వప్న, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ


పరీక్ష ప్యాడ్‌లు అందిస్తున్న ఎస్సై

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రణధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని ఎస్సై దాస సుధాకర్ పంపిణీ చేశారు. గురువారం ఫౌండేషన్ కార్యనిర్వాహక సభ్యులు పిల్లి తిరుపతి, బుర్ర శ్రీనివాస్, గూల్ల రాజు, బోయిని వంశీకృష్ణ, ప్రశాంత్, సంపత్‌తో కలిసి అందజేశారు. ఎస్సై జన్మదినం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఇందుర్తి ప్రభుత్వ పాఠశాలలో జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో లక్ష్మిచారిటబుల్ ట్రస్టు చైర్మన్ జి. రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలు చేయొద్దు'

వీణవంక: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, ప్రతిపక్షాలు ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మాసాడి శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో గురువారం మాట్లాడారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలతో దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇప్పటికైనా లేనిపోని ఆరోపణలను మానుకోవాలని హితవుపలికారు. లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న వెంకటేశ్వర్‌రావు

రామడుగు: మండలంలోని గోలిరామయ్యపల్లి బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొలిపాక మల్లేశం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగ గురువారం ఆయన కుటుంబ సభ్యులను రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి పరామర్శించారు. గోపాల్‌రావుపేటలో బీఆర్‌ఎస్ నాయకుడు అరుణ్‌కుమార్ తండ్రి మృతి చెందగ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట పార్టీ మండలశాఖ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, రజాబ్ అలీ, కలిగేటి లక్ష్మణ్, పైండ్ల శ్రీనివాస్, చెంద్రారెడ్డి, పాపిరెడ్డి, తిరుపతి ఉన్నారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి జువేరియా గురువారం సందర్శించారు. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓపీ, పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ వేర్వేరుగా నిర్వహించాలని వైద్యులకు సూచించారు. గ్రామాల్లో సాయంత్రం వరకు శిబిరాలు కొనసాగించాలని ఆదేశించారు. వెంట హుజురాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ సనా జవేరియా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రత్నకుమారి, ఆప్తామాలజిస్ట్ అమరేందర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ పవన్‌తో, వైద్య సిబ్బంది సంధ్య, శ్రీముఖి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిళి రమేష్, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ అన్నారు. జిల్లా వైద్యాధికారి సందర్శనకు ముందు గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నరని పేర్కొన్నారు. గ్రామంలో శిబిరం 13 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పర్శరాములు, ఎంపీటీసీ సభ్యురాలు వసుంధర వెంకన్న, ఉపసర్పంచ్ సత్యనారాయణ, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు లింగారావు, హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రజిత

చొప్పదండి: ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాలని తహసీల్దార్ అంబటి రజిత కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అప్‌డేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. 2010 నుంచి 2018 వరకు కార్డులు పొందినవారు ప్రభుత్వ గుర్తింపు కార్డులు, ఓటర్ ఐడీ, పాసుబుక్కులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపుకార్డుల ద్వారా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ మేరకు యూఐడీఏఐ సంస్థ ప్రజలకు పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ అరుణ్‌కుమార్, త్రిపాల్‌సింగ్, మోహన్ రెడ్డి, చల్ల క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి వరిసాగుపై అవగాహన


మాట్లాడుతున్న ఏవో సునీల్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట రైతువేదికలో గురువారం తడి, పొడి వరిసాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో సునీల్‌కుమార్ తడి, పొడి సాగు ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో పొద్దుటూరి సతీష్‌రెడ్డి, పద్మపాణి స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ చింతల కొండల్‌రెడ్డి, సంస్థ మండల కోఆర్డినేటర్ మెడుదుల రమేష్, రైతుబంధు సమితి సభ్యుడు శ్రీనివాస్, సమ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రజలు రోగాల బారినపడకుండా చూడాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి శ్మశాన వాటిక వద్ద ఉన్న గుంతలో పట్టణం నుంచి సేకరించిన చెత్తాచెదారం, వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వెలువడుతోందని, ప్రజలు రోగాల బారినపడుతున్నారని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ సలీంపాషా అన్నారు. గురువారం కొత్తపల్లిలో మాట్లాడారు. గుంతను పూడ్చడానికి రూ.30 లక్షలు నిధులు మంజూరయ్యాయని, చెత్తాచెదారంతో గుంతను నింపి పాలకవర్గం, స్థానిక ప్రజాప్రతినిధులు నిధులు కాజేసుందుకు చూస్తున్నరని ఆరోపించారు. మట్టితో నింపి దుర్వాసన రాకుండా చేయాలని, శ్మశాన వాటిక స్థలాన్ని కొందరు కబ్జా చేశారని, విచారణ చేపట్టి కబ్జాకు గురికాకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాటిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కసుబోజుల వెంకన్న, చిన్నంటి నాగేంద్ర,యుత్ కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి రంజీత్‌రెడ్డి, బోనగిరి ప్రశంత్, మధు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో ట్రైనీ కలెక్టర్ పర్యటన


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

హుజూరాబాద్: పట్టణంలో గురువారం ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో పర్యటించారు. పలు ఏరియాల్లో తిరుగుతూ పన్ను బకాయి ఉన్న దుకాణాల వివరాలు తెలుసుకుంటూ ముందుకుసాగారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఆఫీసులోని పలు రికార్డులను పరిశీలించారు. నియోజకవర్గంలో పదకొండు రోజుల పాటు పర్యటించనున్నారు. వెంట ఆర్డీవో హరిసింగ్, తహసీల్దార్ చింతల కోమల్‌రెడ్డి, కమిషనర్ సల్వాది సమ్మయ్య తదితరులు ఉన్నారు.

కాన్షీరాం స్ఫూర్తితో | రాజ్యాధికారం సాధించాలి


నివాళి అర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కరీంనగర్: బహుజన రాజ్యాధికార ప్రదాత కాన్షీరాం సామాజిక ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రంలో బహుజనులు రాజ్యాధికారం సాధించాలని పలు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కాన్షీరాం జయంతి ఉత్సవాల్లో భాగంగా బీఎస్ఎఫ్ అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ ఆధ్వర్యంలో కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. శాస్త్రవేత్తగా ఉద్యోగ జీవితాన్ని వదిలి, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర, సైకిల్ యాత్ర చేసి, ప్రజలను చైతన్యం చేసిన మహానీయుడు కాన్షీరాం అని కొనియాడారు. రాజ్యాధికారం మాత్రమే ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలకు పరిష్కార మార్గమని నమ్మిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ అధ్యక్షుడు పాటకుల భూమయ్య, తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల భూషణ్ రావు, భీమ్ ఆర్మీ చీఫ్ సెక్రటరీ వాసాల శ్రీనివాస్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కేమసారం సమ్మయ్య, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రామచంద్రనాయక్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సాగర్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ సందర్శన


మాట్లాడుతున్న డీఈవో జనార్దన్ రావు

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీ కరీంనగర్ డైట్ కళాశాలలో జరుగుతున్న యూడైస్ ప్లస్ వాలిడేషన్ వర్క్‌షాప్‌ను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యూడైస్ ప్లస్ వాలిడేషన్స్ ఎలాంటి తప్పులు లేకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌సీ మహేందర్, టీపీ భరత్, వివిధ మండలాల ఎంఐఎస్, సీసీవోలు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం


సుందరగిరిలో రక్తదానం చేస్తున్న యువకులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామంలో గురువారం యువకులు రక్తదానం చేశారు. కార్స్ అడ్డా కరీంనగర్ యూట్యూబ్ చానెల్–రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో దాదాపు 30 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకట్‌రమణారెడ్డి, కార్స్ అడ్డా నిర్వాహకులు శ్రీమూర్తి సతీష్, బాకం ఆదర్శ్, వార్డు సభ్యులు కంది శంకర్, నాంపల్లి కొంరయ్య, నవీన్, రాజు, సంతోష్, మహేందర్ పలువురు పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారందరికి పండ్లు, జ్యూస్ అందించారు.

క్రీడా మైదానం పరిశీలన


మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని గురువారం జిల్లా క్రీడాశాఖ అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి సూచన మేరకు క్రీడా మైదానాన్ని స్టేడియంగా నిర్మించడానికి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. వెంట కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగిశేఖర్

గంగాధర: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలని యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. నిరుద్యోగల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను వెంటనే తొలిగించాలన్నారు. ఇంటర్ మూల్యాంకనంలో అవకతవకలు జరిగితే 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వానికి సోయి లేదన్నారు. నిరుద్యోగులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సమావేశంలో నాయకులు పెద్దెల్లి అంజయ్య,గుంటుకు జితెందర్, ప్రసాద్, మల్లేశం, రమణ, దేవకిషన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలి
చొప్పదండి: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. గురువారం చొప్పదండిలో మాట్లాడారు. ప్రభుత్వం బాధ్యత వహించాలని, చైర్మన్ జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయాలని, పరీక్షలు రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరారు. సమావేశంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, మునిగాల సుధాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్ తహసీల్దార్‌గా బావ్‌సింగ్


బావ్‌సింగ్‌ను సన్మానిస్తున్న రాజయ్య

సైదాపూర్: సైదాపూర్ తహసీల్దార్‌గా బావ్‌సింగ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య శాలువాతో సన్మానించారు. మండలంలో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్కపెల్లి రవీందర్, నాయకులు వర్నె మోహన్‌రావు, ఆవునూరి రాజమౌళి, దరిపెల్లి సమ్మయ్య, శ్రీధర్ ఉన్నారు.

నేషనల్ హాకీ చాంపియన్ టీంకు విద్యార్థి ఎంపిక


అభినందిస్తున్న కరస్పాండెంట్, అధ్యాపకులు

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాల బీకాం ప్రథమ సంవత్సర విద్యార్థి మునుగొండ వంశీ నేషనల్ హాకీ చాంపియన్ టీంకు ఎంపికయ్యాడని కళాశాల కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి మే 8వ తేదీ వరకు 13వ హాకీ ఇండియా జూనియర్ మెన్ నేషనల్ చాంపియన్ షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా సమ్మయ్య


బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ సమ్మయ్య

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ కె. సమ్మయ్య దీర్ఘకాలిక సెలువులపై వెళ్లడంతో హుజూరాబాద్ కమిషనర్ ఎస్. సమ్మయ్య జమ్మికుంట ఇన్‌చార్జి కమిషనర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ...మార్చిలోపు మున్సిపాలిటీకి సంబంధించిన పన్నులు చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ అధికారులు, సిబ్బంది కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కమిటీ

మానకొండూర్: మండలంలోని లలితాపూర్ గ్రామంలో గురువారం శ్రీసీతారామ ఆలయ నూతన కమిటీని సర్పంచ్ మర్రి కొండయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా వేముగంటి ప్రసాద్ రావు ఉపాధ్యక్షులుగా వెల్మారెడ్డి రామిరెడ్డి, రాయలింగు 28 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్‌టౌన్: మనిషికి మంచి నిద్రతోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని పల్మనాలజిస్టు డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. మార్చి 17 వరల్డ్ స్లీప్ డే సందర్భంగా గురువారం సూర్య చెస్ట్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిద్ర ప్రాముఖ్యతకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో 30 శాతం మంది నిద్రలేమితో, పలు రకాల వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. శరీరానికి ఆహారం, వ్యాయామం ఎంత ముఖ్యమో నిద్ర కూడా అంతే ముఖ్యమని అన్నారు. అందుకే నిద్రను థర్డ్ పిల్లర్‌గా భావిస్తామని చెప్పారు.

ఆధ్యాత్మికం

ఆలయ అభివృద్ధికి రూ. 51,116 విరాళం

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయ అభివృద్ధికి స్థానిక ఆటోస్టోర్ నిర్వాహకుడు అనుమల్ల సత్యనారాయణ రమాదేవి దంపతులు గురువారం రూ. 51,116 విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డి, దండె లింగయ్య, దూస రాము, తదితరులు పాల్గొన్నారు.

వేంటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు
మానకొండూర్: మండల కేంద్రంలోని పురాతన శ్రీలక్ష్మీ వేంటేశ్వరస్వామి దేవాలయ ద్వారపాలక-సుదర్శన ప్రతిష్ఠ సహిత అష్టోత్తర శత ఘటాభిషేక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం ప్రముఖ జ్యోతిష్య, వాస్తు, ఆగమ శాస్త్ర పండితులు నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, అగ్నిప్రతిష్ఠ, కంకణదారణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు ఎమ్మెల్యే బాలకిషన్, జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పండితులు కొదమగుళ్ల వెంకటరమణాచార్యులు, నమిలకొండ రామకష్ణమాచార్యులు, శేషం నవీన్ కుమార్, తిరువరంగం భరతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


మానకొండూర్: ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, తదితరులు